క్లుప్తంగా

కల్యాణ గాయత్రి మహాయజ్ఞం



అయిజ : మండలంలోని ఉప్పల గ్రామంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసాద్ విభాగ్ ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వహిందూ పరిషత్ భాగ్య నగర్ క్షేత్ర సంఘటన మంత్రి మాననీయ గుమ్మళ్ల సత్యం హాజరయ్యారు. వేద పండితులు 108 మంది దంపతులతో సామూహిక చతుర్వేద శతక గాయత్రి మహాయజ్ఞం, భరత మాత హారతి, మృత్యుంజయ మహామంత్రం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జేటీఓగా ఆలూరు యువకుడు ఎంపిక



కుమ్మరి మునిస్వామి

గట్టు : ఆలూరు గ్రామంలోని సామాన్య రైతు కుటుంబానికి చెందిన కుమ్మరి మునిస్వామి అనే యువకుడు జూనియర్ టెక్నికల్ అధికారిగా ఎంపికయ్యాడు. శుక్రవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ టెక్నికల్ అధికారిగా ఎంపికై నట్లు మునిస్వామి తెలిపారు. గతంలో మునిస్వామి చెల్లెలు ఈరమ్మ టీచర్ ఉద్యోగం సాధించింది. ఒకే ఇంట్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

షెట్టర్ గేర్‌బాక్స్, బోల్టులు చోరీ



మానవపాడు : మండలంలోని డీ- 30 కాలువకు సంబంధించి షెట్టర్ బోల్ట్‌లు, గేర్ బాక్స్‌లు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించినట్లు ఏఈ నిరంజన్ తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా శనివారం డీ-30 కాలువ వద్ద పోలీసులు పరిశీలించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయుడి ప్రతిభ



గద్వాలటౌన్ : ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక 2024- 25 ప్రదర్శనలో గద్వాల ఉపాధ్యాయుడు ప్రతిభ చాటారు. స్థానిక ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుడు నాగరాజు 'చంద్రకళలు' అనే అంశంతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లో నాగరాజు ప్రదర్శన ఆకట్టుకుంది. ఎగ్జిబిట్ దక్షిణ భారతస్థాయి టాప్ టెన్‌లో నిలిచింది. ప్రతి రాష్ట్రం నుంచి పది మంది ఉపాధ్యాయులు తమ ప్రదర్శనలు ప్రదర్శించారు. పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమశివాయం చేతుల మీదుగా ప్రశంసా పత్రం, బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ అబ్దుల్ ఘని, హెచ్ఎం వెంకటనర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న, అభినందనలు తెలియజేశారు.

బహిరంగ సభకు తరలిన సీపీఎం శ్రేణులు

గద్వాల: సీపీఎం రాష్ట్ర మహాసభలు 25 నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సంగారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్తున్నట్లు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహా తెలిపారు. మహాసభలో జిల్లాలో రైతులు, కార్మికులు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాసు, పరంజ్యోతి, మద్దిలేటి, నర్సింహా, ఈదన్న, రమేష్, వెంకటేశ్వర్లు, తిమ్మప్ప, మోష, రఘు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కేటీదొడ్డి: పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గువ్వలదిన్నెలోని మామిడి తోటలో పేకాట స్థావరంపై దాడి చేయగా ముగ్గురుని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారైనట్లు సీఐ తెలిపారు. వారి వద్ద రూ.1000 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఓటుహక్కు.. ఓ వజ్రాయుధం

అలంపూర్ : ప్రజాస్వామ్యంలో ఓటే ఒక వజ్రాయుధమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌లో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓ అశోక్ కుమార్, కౌన్సిలర్లు పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైంది..

గట్టు : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటుతో నేతల తలరాత మార్చవచ్చని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో కాలేజీ విద్యార్థులు, రెవెన్యూ అధికారులు కలసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడులో..

మానవపాడు: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ వాహిదా ఖాతూన్, ఎంఈఓ శివప్రసాద్, డీటీ ధరణి ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. గాంధీచౌక్ ప్రధాన కూడలి వద్ద మానవహారంగా నిల్చొని ప్రతిజ్ఞ నిర్వహించారు. లక్ష్మిదేవి(84), నాగన్న(80) అత్యధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామూర్తి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ జ్యోతి పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభించిన ర్యాలీ కొత్త బస్టాండ్ చేరుకుంది. మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములు, పీఈటీలు, ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోళిలో..

రాజోళి : ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్థాపనలో కీలక పాత్ర పోషించాలని తహసీల్దార్ పి.రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గట్టు బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ఇటిక్యాల : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జాతీయ ఓటర్ల దినోత్సవం తహసీల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. అదే విధంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఆర్ఐ భీంసేన్ రావు పాల్గొన్నారు.

మల్దకల్‌లో..

మల్దకల్ : ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా భావించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ జుబేర్ మొయిద్దీన్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, నరేందర్, వెంకటన్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ..

ఉండవెల్లి: మండల కేంద్రం, పుల్లూరు గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. పాఠశాలలో ఆర్ట్స్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీదొడ్డిలో..

కేటీదొడ్డి: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మీ సేవ సెంటర్‌లో ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకుంటామని ప్రజల చేత మీసేవ నిర్వాహకులు ప్రతిజ్ఞ చేయించారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నరేష్ కార్యాలయం సిబ్బంది, ఓటర్లతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు శంషీర్, శ్రీనివాసులు, ఎస్ఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం..

శాంతినగర్: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో విద్యార్థులతో తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మోడల్ ఎన్నికలు..

గట్టు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆలూరు ఉన్నత పాఠశాలలో మోడల్ ఎన్నిక నిర్వహించారు. సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పోలింగ్ కేంద్రం దగ్గర బారులు తీరినట్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయు లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్యోతి



ఆలూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన బాలికలు



ఎర్రవల్లిలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ నరేష్

ఘనంగా వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో కౌన్సిలర్లు



వీడ్కోలు సమావేశంలో నేలపై కూర్చున్న పారిశుద్ధ్య కార్మికులు

అయిజ : మున్సిపాలిటీలో పాలకవర్గం ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అదే విధంగా అఖిలపక్ష కమిటీ నాయకులు సమీకృత మార్కెట్ భవనంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్న దేవన్న, వార్డు కౌన్సిలర్లను, కోఆప్షన్ సభ్యులను మున్సిపల్ అధికారులు, పలు పార్టీలు, సంఘాల నాయకులు సన్మానించారు.

కార్మికులపై చిన్న చూపు...

మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులను నిర్వాహకులు, నాయకులు చిన్న చూపు చూశారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. వీడ్కోలు సమావేశానికి హాజరైన వారందరూ కుర్చీలపై కూర్చున్నారని, పారిశుద్ధ్య కార్మికులను మాత్రం నేలపై కూర్చోబెట్టారని విమర్శిస్తున్నారు. దీనిని ఫొటో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

గ్రామసభల దరఖాస్తులు పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీఓ లక్ష్మీనారాయణ

ఉండవెల్లి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామసభల దరఖాస్తులను ఆర్డీఓ లక్ష్మీనారాయణ పరిశీలించారు. శనివారం రేషన్, ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చిన అర్హులకు స్వాతంత్ర్య దినోత్సవం నాడు పత్రాలు అందజేస్తామని తెలిపారు. బస్వాపురంలో అర్హులకు ఆదివారం మధ్యాహ్నం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ తిరుపతన్న, ఏఓ సురేఖ, అధికారులు పాల్గొన్నారు.

30న సన్నాహక మహాప్రదర్శన

గద్వాల : చలో హైదరాబాద్‌లో లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ఈనెల 30వ తేదీన గద్వాలలో జిల్లా సన్నాహక మహా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ రానున్నట్లు రాజేష్ మాదిగ చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్వాలలో నిర్వహించే జిల్లా సన్నాహక మహాప్రదర్శన సభను విజయవంతం చేసేలా అందరిని సమాయత్తం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త డప్పును వెంట తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, కన్నా, పరుశరామ్, ఆంజనేయులు, మన్యం, తిమ్మన్న, ఏసన్న, రాజు, తిక్కన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



ఉండవెల్లిలోని పాఠశాలలో రంగుల కాగితాలు కడుతున్న విద్యార్థులు

అలంపూర్ : నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాలు గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబయ్యాయి. శనివారం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంగు రంగుల ముగ్గులతో, త్రివర్ణ రంగుల కాగితాలతో స్వాగత తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

రాజోళిలో..

రాజోళి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు శనివారం ముస్తాబయ్యాయి. మువ్వెన్నెల జెండా ఎగుర వేసేందుకు కార్యాలయాల్లో జెండా కాగితాలు, జెండా కర్రలు సిద్ధం చేశారు.

వేడుకలకు పాఠశాల ముస్తాబు..

ఉండవెల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తోకపిట్టలతో ముస్తాబు చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేయడం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజలు, రైతులు రోడ్లు, కల్వర్టులు సక్రమంగా లేకపోవడం వల్ల పడుతున్న ఇబ్బందులను గుర్తించి తక్షణమే వాటిని పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, దివాకర్, బీసన్న, మణి, రత్నం, మద్దిలేటి, జయరాం, సాగర్, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చెత్తబుట్టల వితరణ



చెత్తబుట్టలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మన్న

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆంగ్ల ఉపాధ్యాయుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో ఎంఈఓ శివప్రసాద్‌కు 25 చెత్త బుట్టలు అందజేశారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారాలు వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాలు సేకరించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటిలో మురుగు నీరు చేరి కలుషితమవుతున్నాయని దీంతో కాలనీ వాసులు రోగాలబారిన పడుతున్నారని 'సాక్షి'లో 'భగీరథలో మురుగునీరు' అనే కథనం శనివారం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ భాస్కర్, మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర, కార్యదర్శి, ల్యాబ్ అధికారులు బీసీ కాలనీలో పర్యటించి నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ కాలనీలో నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

ప్రభుత్వం కాలయాపన చేస్తుంది



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి

అయిజ : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన, గ్రామసభల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం, సీట్ల కోసం 6 గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు 66 అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించిన వారికి మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందకుంటే బీజేపీ నాయకులు ప్రజల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో ఆరోగ్యం పదిలం

రాజోళి : అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. మండల కేంద్రం తెలుగుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ అధికారులు చేపట్టిన యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్

అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యం కావాలి

రాజోళి : అంబేడ్కర్ ఆశయాలే ప్రతి విద్యార్థికి లక్ష్యం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశి కుమార్ అన్నారు. భారత్ సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం వీవర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను బీజేపీ నాయకులు పర్యటించారు. వసతులు పరిశీలించి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఈసీ అంజనేయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు స్మరించుకోవాలి..

అయిజ : మండలంలోని బింగిదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల కృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సేవలు స్మరించుకోవాలన్నారు. హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్ దాస్, ఉపాధ్యాయ బృందం బాలకృష్ణ, గోవర్ధన్, కృష్ణ, వందన, యాదేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి : మండల పరిధిలోని ధర్మవరం పాఠశాల, బీసీ వసతి గృహంలో బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి హాజరై విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. దూరదృష్టి గల రాజ్యాంగ నిర్మాతలు మారుతున్న కాల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆలోచనలను స్వీకరించే వ్యవస్థను అందించాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శివరాంరెడ్డి, రాముడు, రాజు, నాగరాజు, బాబు, తదితరులు పాల్గొన్నారు.



రాజోళిలో పుస్తకాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కేటీదొడ్డి : బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి, గద్వాల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత అన్నారు. శనివారం మండలంలోని పాగుంట గ్రామంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వద్దు మాకు పెళ్లి- బడికి పోతాం మేం అనే పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహం చేసిన వారికి 2 సంవత్సరాలు జైల్లు శిక్ష, రూ.1 లక్ష జరిమానా ఉంటుందని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కమిటీ పాగుంట గ్రామం నుంచి కొండాపురం హైస్కూల్‌కు వెళ్తున్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, సీఆర్పీ యుగంధర్, హెచ్ఎంలు రఘురాం, ఎంవీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.